
సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
RNI APTEL / 2018/76380
SK1 one NEWS HD
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 07 సంచిక : 354 | పేజీలు : 08, వెల రూ. 2 రూ/ | ఆదివారం 08-03-2026

## విపక్షం లేకున్నా ఐదు కోట్ల ప్రజల కోసమే చర్చలు

- 15 రోజుల పాటు అసెంబ్లీలో చర్చలు జరిపినట్లు చంద్రబాబు వెల్లడి
- గత పాలకుల విధ్వంసం నుంచి ఏపీ పునర్నిర్మాణం జరుగుతోందని ఉద్ఘాటన
- సభలో లేకుండా పారిపోయిన పార్టీ ప్రతిపక్షం హోదా కోసం డిమాండ్ చేస్తోందని ఎద్దేవా
- ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్న సీఎం



అమరావతి: గడచిన పదిహేను రోజులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ వేదికగా కేవలం చట్టాలు చేయడం మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా అర్థవంతమైన చర్చలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా సభలో మిగతా..2లో

## అందుకే మాదిగల వైపు నిలబడ్డా

- మేం మాటలతో గెలవలేదు.. కమిట్‌మెంట్‌తో గెలిచాం
- తెలంగాణ పునర్నిర్మాణంలో మాదిగల భాగస్వాములు కావాలి
- ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న బలమైన ఆకాంక్షతో 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు




హైదరాబాద్: చాలా కాలం నుంచి ఎస్సీ వర్గీకరణ అంశం నలుగుతోందని, ఈ అంశాన్ని 20 ఏళ్ల నుంచి గమనిస్తున్నాని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో తెలంగాణ మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ నిర్వహిస్తున్న ధన్యవాద సభలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ' మేం మాటలతో గెలవలేదు.. కమిట్‌మెంట్‌తో గెలిచాం. వర్గీకరణ అంశంలో మాదిగవైపు న్యాయం ఉంది. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మాదిగల వైపే నిలబడ్డాను. తెలంగాణ పునర్నిర్మాణంలో మాదిగల మిగతా..2లో

## ఏపీలో 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం



- సీఎం చంద్రబాబు కీలక ప్రకటన
- 13 నుంచి 16 ఏళ్ల వయసు వారిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని వెల్లడి

అమరావతి: సోషల్ మీడియా వినియోగంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 13 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా నిషేధం విధిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. శుక్రవారం అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై మాట్లాడుతూ ఆయన ఈ కీలక విషయాన్ని వెల్లడించారు. రాబోయే 90 రోజుల్లోగా దీనికి సంబంధించి మిగతా..2లో



## నేడు ఢిల్లీలో 110 దేశాల ప్రతినిధులతో సదస్సు...


### ఏపీ బ్రాండ్ ఇమేజ్‌పై సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్

- నేడు ఢిల్లీలో రైసినా డైలాగ్ 2026 సదస్సు
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- సాంకేతికత వినియోగం మరియు సుపరిపాలనపై కీలక ఉపన్యాసం చేయనున్న ముఖ్యమంత్రి
- సదస్సుకు హాజరుకానున్న 110 దేశాలకు చెందిన 2,700 మంది అంతర్జాతీయ ప్రతినిధులు

# విద్య కోసం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నాం

## 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు

### చిత్తశుద్ధితో ప్రజల ముందుకు వచ్చాం



హైదరాబాద్: మిత్రుడి కోసం చివరి ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని, నేను కూడా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మాదిగ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శిల్పకళావేదికలో సీఎంకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని అన్నారు. చిత్తశుద్ధితో ప్రజల ముందుకు వచ్చాం కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. " మీ లక్ష్యాన్ని సాధించడానికి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. రిజర్వేషన్ల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడారు. ప్రజాజీవితంలోకి వచ్చినప్పటి నుంచి మీ సమస్యను చూస్తూనే ఉన్నాను. మీ న్యాయమైన హక్కును సాధించడానికి మీతోపాటు నడిచా. కులాల వర్గీకరణకు సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. అన్ని సమస్యలకు వర్గీకరణ పరిష్కారం కాకపోవచ్చు. మీ సమస్యలు పరిష్కరించేటప్పుడు అడ్డుకునేవారిని మీరే నిలువరించాలి. బాధ్యతతో వ్యవహరిస్తే మీ జాతికి న్యాయం జరుగుతుంది. ప్రగతి ప్రణాళికలో నిర్లక్ష్యంగా ఉండొద్దు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ ఫలాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం. మీరు పన్నులు సక్రమంగా వసూలు చేసి ఖజానా నింపితే పేదలకు మేలు జరుగుతుంది. పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవు. చదువు ఒక్కటే ప్రజలకు ఇవ్వగలిగే ఆస్తి. విద్య కోసం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నాం. ప్రభుత్వ ప్రణాళికలను అమలు చేసేది మీరే. భవిష్యత్‌లో మీ హక్కులకు చట్టబద్ధత కల్పిస్తాం. గత ప్రభుత్వం గొర్రెలు, బర్రెలు, చేప పిల్లలు ఇచ్చింది. కానీ, చెప్పులు కుట్టే ఈ జాతి ప్రజలు డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కావాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## తెలంగాణలో ముందుగానే ముదిరిన ఎండలు..

- ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- ములుగు జిల్లాలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- ఆరు జిల్లాల్లో 40 డిగ్రీలు దాటే అవకాశం, ఆరెంజ్ అలర్ట్ జారీ
- ఉత్తర భారతం నుంచి వీస్తున్న వేడి గాలులే కారణమని వెల్లడి
- మధ్యాహ్నం బయటకు రావొద్దని ప్రజలకు నిపుణుల సూచన



హైదరాబాద్: తెలంగాణలో వేసవి తన ప్రతాపాన్ని ముందుగానే చూపిస్తోంది. మార్చి నెల ప్రారంభంలోనే సూర్యుడు భగభగ మండుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. సాధారణంగా మార్చి మూడో వారం తర్వాత పెరిగే ఎండల తీవ్రత, ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే మొదలైంది. ఈ ఏడాదిలో తొలిసారిగా నిన్న ములుగు జిల్లా మిగతా..2లో

## కలరి మార్షల్ ఆర్ట్ ను ప్రయత్నించిన రాహుల్ గాంధీ...




ఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేరళ పర్యటనలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఇడుక్కి జిల్లాలోని మరియన్ కాలేజీ (కుట్టిక్కనం క్యాంపస్) విద్యార్థులతో ఆయన ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా కేరళ అత్యంత ప్రాచీన యుద్ధ విద్య అయిన 'కలరిపయట్టు' (కలరి) విన్యాసాలను విద్యార్థులతో మిగతా..2లో

## ఈ నెలాఖరు నాటికి నక్సలిజం పీడ విరగడవుతుంది



ఢిల్లీ: దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి స్పష్టం చేశారు. ఒడిశాలోని కటక్‌లో జరిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) 57వ రైజింగ్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మిగతా..2లో

## కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయి



ఢిల్లీ: అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత తీవ్రతరమైన ఉద్రిక్తతలను తగ్గించేందుకు "కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభించాయి" అని ఆయన ప్రకటించారు. ప్రాంతీయ మిగతా..2లో



## కేరళలో ఎన్నికల ప్రచారం కోసం రేవంత్ సర్కార్ వందల కోట్లు తగలేస్తోంది

- కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఖజానా ఏటీఎంలా మారిందన్న హరీశ్
- ఇక్కడ హామీలను విస్మరించి.. కేరళలో దొంగ ప్రచారం చేసుకుంటున్నారని మండిపాటు
- రాష్ట్రంలో రైతులను మోసం చేశారని విమర్శ

2లో

## రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ




- అంబర్ పేట ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్డు నిర్మాణంలో అడ్డంకులు
- సర్వీస్ రోడ్డు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్న కిషన్ రెడ్డి
- రేవంత్ రెడ్డి చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరిన కేంద్ర మంత్రి

# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది

## అసెంబ్లీలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ

- తాజా బడ్జెట్ 5 కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమన్న పవన్
- వైసీపీ హయాంలో విద్యుత్ సంస్థలు రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని వెల్లడి
- రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ పాలనలో జరిగిన 'ఆర్థిక విధ్వంసం' కారణంగా రాష్ట్రం దాదాపు 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రూ. 3.32 లక్షల కోట్ల బడ్జెట్, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమని ఆయన కొనియాడారు. మిగతా..2లో

సీమకిరణం నంద్యాల కర్నూలు
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



## అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో
# వందలాది చిన్నారులు మృతి

ఢిల్లీ: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దాడుల కారణంగా పశ్చిమాసియాలో వందల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. గత నెల 28న ప్రారంభమైన యుద్ధం నేటితో ఏడవ రోజుకు చేరుకున్నది. ఈ యుద్ధంలో అత్యధికంగా ఇరాన్‌లో చిన్నారులు చనిపోయినట్లు తెలిపింది. ఇరాన్‌లో 181 మంది, లెబనాన్‌లో 7గురు, ఇజ్రాయెల్‌లో ముగ్గురు, కువైట్‌లో ఒకరు మృతి చెందినట్లు వెల్లడించింది. యుద్ధాలను పిల్లలు ప్రారంభించరని కానీ వారు కూడా మూల్యం చెల్లించుకుంటున్నారని పిల్లల హక్కులు, ఆరోగ్యం, విద్య, సంక్షేమం కోసం పనిచేసే ఈ ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ ఆవేదన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త ఆపరేషన్‌లో మొదటి రోజు ఇరాన్‌లోని మినాబ్‌లో ఒక బాలికల పాఠశాలపై దాడి జరగగా, 160 మంది చిన్నారులు మృతి చెందినట్లు ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది.

## 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా
## వినియోగంపై నిషేధం: కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం

కర్ణాటక: కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నది. 16 సంవత్సరాల లోపు పిల్లలు సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించింది. ఈ మేరకు బడ్జెట్ సమర్పణ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అసెంబ్లీలో ప్రకటించారు. పిల్లలు మొబైల్ ఫోన్ వ్యసనం బారిన పడకుండా అడ్డుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్‌లను ఎక్కువగా ఉపయోగించడం పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మొబైల్ అతి వినియోగం వల్ల కంటిచూపు సమస్యలు, ఊబకాయం, నిద్రలేమి, ఏకాగ్రతలోపం తదితర సమస్యలు వస్తున్నాయి. 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాపై నియంత్రణ అవసరమని నిపుణులు కూడా సూచిస్తున్నారు. ఈ క్రమంలో కర్ణాటక ప్రభుత్వం 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉండగా, కర్ణాటక అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆయన రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇది 17వసారి. రాష్ట్రంలో ఎక్కువసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేతగా ఆయన రికార్డు సొంతం చేసుకున్నారు. భారతదేశంలో అత్యధికసార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేతల జాబితాలో రెండవ స్థానంలో ఉన్నారు.

## ఇరాన్ విషయం పూర్తయ్యాక
## క్యూబా సంగతి చూస్తాం: ట్రంప్ హెచ్చరిక

ఢిల్లీ: మొదట ఇరాన్ విషయం తేల్చిన తర్వాత క్యూబాపై దృష్టి సారిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. 2025 మేజర్ లీగ్ సాకర్ ఛాంపియన్స్‌గా నిలిచిన ఇంటర్ మయామి జట్టుకు శ్వేతసౌధంలో ట్రంప్ ఘనంగా ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఇరాన్ పని ముగించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇజ్రాయెల్‌తో కలిసి అనుకున్న దానికంటే వేగంగానే తమ దళాలు ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తున్నాయని అన్నారు. వరుస దాడుల వల్ల ఇరాన్ సైనిక సామర్థ్యాలు కూడా భారీగా క్షీణించాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్, అమెరికాకు ఉన్నట్లు ఇరాన్‌కు సమర్థవంత వైమానిక దళం లేదని అన్నారు. ఇప్పటికే ఇరాన్ నావికా దళాన్ని నాశనం చేశామని అన్నారు. మూడు రోజుల్లో 24 ఇరాన్ నౌకలను తుడిచి పెట్టడంతో ఇరాన్ అధికారులు కాళ్ల బేరానికి వచ్చారని అన్నారు. అణు ఒప్పందంపై చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు తమతో చెప్పారని వెల్లడించారు. వారి విజ్ఞప్తిని తోసిపుచ్చామని, ఇప్పటికే ఆలస్యమైందని వారికి స్పష్టం చేసినట్లు ట్రంప్ తెలిపారు. టెహ్రాన్ రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించడానికి ఇరాన్ దౌత్యవేత్తలు తమకు సహకరించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమతో ఒప్పందం కోసం క్యూబా కూడా వేచిచూస్తోందని ట్రంప్ తెలిపారు. కానీ ఆ దేశ ప్రభుత్వం అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ఇరాన్ పని ముగిసిన తర్వాత క్యూబా సంగతి చూస్తామని అన్నారు. అయితే అది ఎప్పుడనేది ఇప్పుడే చెప్పలేమని వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలో తమ ఆపరేషన్ ముగిసిన తర్వాత అమెరికా విదేశాంగ విధాన ప్రాధాన్యతలలో పలు మార్పులు చోటు చేసుకుంటాయని అన్నారు.


## బొత్సకు మళ్లీ అస్వస్థత...
## పరిస్థితి గమనించి సూచన చేసిన పయ్యావుల

అమరావతి: వైసీపీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. శాసనమండలిలో జరుగుతున్న చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతుండగా అస్వస్థతకు లోనయ్యారు. సభలో ప్రసంగిస్తున్న సమయంలో బొత్స తీవ్రంగా ఇబ్బంది పడటాన్ని గమనించిన మంత్రి పయ్యావుల కేశవ్ వెంటనే స్పందించారు. బొత్స ఇబ్బందిని గుర్తించిన మంత్రి పయ్యావుల.. ప్రసంగాన్ని కాసేపు నిలిపివేసి, కూర్చుని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ అధికారులు వెంటనే వైద్యులను మండలికి పిలిపించారు. అక్కడికి చేరుకున్న వైద్య బృందం అసెంబ్లీ ఆవరణలోని డిస్పెన్సరీలో బొత్సకు పలు రకాల పరీక్షలు నిర్వహించింది. రక్తపోటు (బీపీ)లో హెచ్చుతగ్గుల కారణంగానే బొత్స అస్వస్థతకు గురయ్యారని డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు విశ్రాంతి చాలా అవసరమని వైద్యులు స్పష్టం చేశారు. అస్వస్థత నేపథ్యంలో అసెంబ్లీ వైద్యులు.. బొత్సకు రెగ్యులర్ గా చికిత్స అందించే స్పెషలిస్ట్ డాక్టర్లతోనూ మాట్లాడారు. ప్రస్తుతం బొత్స ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. అయితే ముందస్తు జాగ్రత్తగా, మెరుగైన వైద్య చికిత్స కోసం బొత్సను హైదరాబాద్ కు తరలించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇటీవలే బొత్స అనారోగ్య సమస్యలతో హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే.

## ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదు
### కాంగ్రెస్ ప్రభుత్వ 99 రోజుల ప్రణాళికపై హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ఉత్తి దండగ ప్రచార పర్వమని, ఇది ప్రజలను మభ్యపెట్టే మరో నాటకమని ఆయన ఎద్దేవా చేశారు. దాదాపు 800 రోజుల పాలనలో (రెండున్నరేళ్లు) చేసిందేమీ లేక, ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు. గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన (గ్రామసభల్లో) ప్రజల నుంచి స్వీకరించిన లక్షలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని హరీశ్ రావు విమర్శించారు. ఆ దరఖాస్తులకే దిక్కులేదని, ఇప్పుడు మళ్లీ పది వారాల పాటు పది రకాల కార్యక్రమాలంటూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కొల్లగొట్టబడుతున్న చేసిన ప్రజలను సొంత తప్పించుకునేందుకే ఈ 'డైవర్షన్ ప్లాన్' రచించారని మండిపడ్డారు. మీ పాలనలో సగం కాలం పూర్తయినా ఇంకా ఎన్ని రోజులు ప్రచారాలతో నెట్టుకొస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితిని ప్రస్తావిస్తూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. పంట కోతల సమయం వచ్చినా ఇంకా రైతు భరోసా అందలేదని, గత సీజన్ పంట బోనస్ ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేక అన్నదాతలను నడిరోడ్డు మీదకు ఈడ్చారని, నమ్మించి గొంతుకోసిన ఈ మోసాల గురించి ఇప్పుడు గ్రామసభల్లో రైతులకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అలాగే యువతకు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, జాబ్ క్యాలెండర్ కాస్తా 'జాబ్ లెస్' క్యాలెండర్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో లూటీకి ప్రాధాన్యత ఇస్తూ, నోటిఫికేషన్లను గాలికి వదిలేశారని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు మూలనపడ్డాయని, ఇప్పుడు నైపుణ్య శిక్షణ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి అంటూ ప్రభుత్వం చెప్పే గొప్పలు చూస్తుంటే నవ్వొస్తోందన్నారు. ఆసుపత్రుల్లో మందులు లేక, బడుల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయడం, పారిశుధ్యం నిర్వహించడం కనీస బాధ్యత అని, దానిని కూడా ఒక ఈవెంట్‌లా మార్చుకోవడం, గొప్పగా చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలన్నీ కేవలం పత్రికల్లో పబ్లిసిటీ కోసమే తప్ప, ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టం చేశారు. పాలనను గాలికి వదిలి పబ్లిసిటీ గారడీలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

# రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ



హైదరాబాద్: అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గత ఏడాది మే నెలలోనే ఈ ఫ్లై ఓవర్‌ను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించినప్పటికీ, కింద సర్వీస్ రోడ్డు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కిషన్ రెడ్డి తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయినా, భూసేకరణలో జాప్యం కారణంగా సర్వీస్ రోడ్డు పనులు నిలిచిపోయాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించి రూ. 2.54 కోట్ల పరిహారం ప్రభుత్వం చెల్లించినప్పటికీ, కొన్ని శక్తులు అడ్డుతగులుతున్నాయని తెలిపారు. తెలంగాణలో 2014 నుం ఇప్పటి వరకు 2,800 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించామని... అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపి, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

## నేడు ఢిల్లీలో 110 దేశాల
# ప్రతినిధులతో సదస్సు...
### ఏపీ బ్రాండ్ ఇమేజ్‌పై సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్

అమరావతి: ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని మరోసారి చాటేందుకు, రాష్ట్రంలో అమలు చేస్తున్న వినూత్న పాలనా విధానాలను అంతర్జాతీయ సమాజానికి వివరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధమయ్యారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరగనున్న అత్యంత ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ఆయన శనివారం హాజరుకానున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో సీఎం పాల్గొని, 'సాంకేతికత - సుపరిపాలన', భవిష్యత్ సవాళ్లు అనే అంశాలపై కీలక ఉపన్యాసం చేయనున్నారు.

ప్రపంచం దృష్టిని ఆకర్షించే వేదిక

ప్రపంచ రాజకీయాలు, అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై చర్చించేందుకు అత్యున్నత వేదికగా 'రైసినా డైలాగ్'కు గొప్ప పేరుంది. 2016 నుంచి ఏటా నిర్వహిస్తున్న ఈ సదస్సు.. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన 'మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్' తరహాలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈసారి జరుగుతున్న 11వ ఎడిషన్ సదస్సులో దాదాపు 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు పాల్గొంటుండటం విశేషం. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించనున్నారు. ఈ ఏడాది ఈ సదస్సును సంస్కార, అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే ఆసక్తికరమైన థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ ఈ సదస్సులో ప్రధాన ఉపన్యాసం చేయనున్నారు.

సీఎం పర్యటన వివరాలు

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు రేపు (మార్చి 7) ఉదయం 10.50 గంటలకు విజయవాడ నుంచి విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ వేదికగా జరిగే 'రైసినా డైలాగ్ 2026' సెషన్‌లో పాల్గొంటారు. సదస్సు ముగిసిన అనంతరం ఆయన తిరిగి అమరావతికి పయనమవుతారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా ప్రసంగం

దేశంలోనే అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన, డిజిటల్ విప్లవం గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో సవివరంగా చెప్పనున్నారు. ప్రధానంగా రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా సామాన్య ప్రజలకు పౌరసేవలను ఎంత వేగంగా, పారదర్శకంగా అందిస్తున్నారో వివరించనున్నారు. పాలనకు సాంకేతికతను జోడించి ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, సంపద సృష్టి, 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' వంటి అంశాలపై తన సుదీర్ఘ అనుభవాలను అంతర్జాతీయ ప్రతినిధులతో పంచుకోనున్నారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎకోసిస్టమ్, భారీ డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం వివరించనున్నారు. పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీని మార్చేందుకు చేస్తున్న కృషిని, భవిష్యత్ ప్రణాళికలను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియజేయనున్నారు.

## ఏపీలో 13 ఏళ్ల లోపు పిల్లలకు
# సోషల్ మీడియా నిషేధం

మొదటి పేజి తరువాయి

రాబోయే 90 రోజుల్లోగా దీనికి సంబంధించి కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ఇక 13 నుంచి 16 ఏళ్ల వయసున్న పిల్లల విషయంలో ఎటువంటి ఆంక్షలు విధించాలనే దానిపై ప్రభుత్వం చర్చిస్తోందని చంద్రబాబు తెలిపారు. దీనిపై అందరితో చర్చించి, ఏకాభిప్రాయం కుదిరిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. యాదృచ్ఛికంగా, కర్ణాటకలోనూ 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియాను నిషేధిస్తున్నట్లు ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య ఇదే రోజు ప్రకటించడం గమనార్హం. పాఠశాల విద్యార్థులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా చట్టం తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని గత నెలలో హోంమంత్రి వంగలపూడి అనిత అసెంబ్లీకి తెలిపారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే రెండుసార్లు భేటీ అయ్యి, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించింది. సోషల్ మీడియా మితిమీరిన వినియోగం వల్ల పిల్లల ఏకాగ్రత దెబ్బతింటోందని, వారి చదువుపై తీవ్ర ప్రభావం పడుతోందని ఐటీ మంత్రి నారా లోకేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి అంతర్జాతీయ విధానాలను పరిశీలించేందుకు మెటా, గూగుల్, ఎక్స్ వంటి దిగ్గజ సంస్థలతో చర్చలు జరపనున్నట్లు లోకేష్ గతంలోనే తెలిపారు. మహిళలు, పిల్లలకు సోషల్ మీడియాను సురక్షితమైన వేదికగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. మరోవైపు, వయసు ఆధారంగా సోషల్ మీడియా నియంత్రణపై జాతీయ విధానం తేవాలని కోరుతూ టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఇటీవల కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పించారు.

## కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి
# ప్రయత్నిస్తున్నాయి

మొదటి పేజి తరువాయి

అని ఆయన ప్రకటించారు. ప్రాంతీయ శాంతికి తాము కట్టుబడి ఉన్నామని, అయితే ఇరాన్ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేసిన వారికి ఈ మధ్యవర్తిత్వం సరైన సమాధానం కావాలని ఆయన 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. తమ దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

కొనసాగుతున్న ఇరాన్ ప్రతీకారం

అధ్యక్షుడి ప్రకటన ఒకవైపు ఉండగా.. క్షేత్రస్థాయిలో ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ తన అత్యంత శక్తివంతమైన 'ఖొర్రమ్‌షహర్-4' బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని తస్నీమ్ వార్తా సంస్థ వెల్లడించింది. "ఆపరేషన్ ట్రూ ప్రామిస్-4"లో భాగంగా 22వ విడత దాడులు మొదలయ్యాయని, ఇవి నేరుగా ఇజ్రాయెల్ భూభాగంపై విరుచుకుపడుతున్నాయని ఇస్లామిక్ రెవెల్యూషన్ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) తెలిపింది. మరోవైపు, లెబనాన్‌లోని సిడాన్ నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఓ నివాస భవనం దెబ్బతిన్నట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది.

### విరుచుకుపడుతున్న అమెరికా 'ఎపిక్ ఫ్యూరీ'

మరోవైపు, ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని మరింత ఉధృతం చేస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. ఫ్లోరిడాలోని టాంపాలో ఉన్న సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ నావికాదళాన్ని, క్షిపణి కేంద్రాలను తమ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని తెలిపారు. "మేము ఈ పోరాటానికి సిద్ధంగా ఉన్నాం, విజయం సాధించే దిశగా వెళ్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఇరాన్‌కు భారీ నష్టం: అమెరికా ప్రకటన

ఈ ఆపరేషన్ ఆరో రోజుకు చేరుకుందని, ఇరాన్ మిలటరీ సామర్థ్యం గణనీయంగా తగ్గిందని అమెరికా సెంట్రల్ కమాండ్ చీఫ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు. గత 72 గంటల్లో టెహ్రాన్ పరిసరాల్లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్లు దాడులు చేశాయి. భూగర్భంలో దాచిన క్షిపణి లాంచర్లను ధ్వంసం చేసేందుకు బీ-2 బాంబర్ల ద్వారా 2000 పౌండ్ల బాంబులను జారవిడిచారు. ఇప్పటివరకు 30కి పైగా ఇరాన్ నౌకలను సముద్రంలో ముంచేశారు. ఇందులో రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ పరిమాణంలో ఉన్న ఓ భారీ డ్రోన్ క్యారియర్ షిప్ కూడా ఉందని, అది ప్రస్తుతం మండుతోందని కూపర్ తెలిపారు. అమెరికా దాడుల ఫలితంగా ఇరాన్ నుంచి వచ్చే బాలిస్టిక్ క్షిపణి దాడులు 90 శాతం, డ్రోన్ దాడులు 83 శాతం తగ్గుముఖం పట్టాయని ఆయన వివరించారు. ఇరాన్ స్పేస్ కమాండ్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా దెబ్బతీశామన్నారు. కేవలం ఇరాన్ దగ్గర ఉన్న ఆయుధాలను ధ్వంసం చేయడమే కాకుండా.. భవిష్యత్తులో వారు తిరిగి కోలుకోలేనంతగా క్షిపణి తయారీ పరిశ్రమను నేలమట్టం చేయడమే తమ తదుపరి లక్ష్యమని అమెరికా స్పష్టం చేసింది.

## కలరి మార్షల్ ఆర్ట్ ను
## ప్రయత్నించిన రాహుల్ గాంధీ...

మొదటి పేజి తరువాయి

కలిసి ప్రయత్నించి అందరినీ ఆకట్టుకున్నారు. కాలేజీ విద్యార్థులతో రాహుల్ ముచ్చటిస్తుండగా, కలరి విద్యను ప్రయత్నించమని ఒక విద్యార్థి కోరారు. దీనికి రాహుల్ వెంటనే అంగీకరించి, విద్యార్థులతో కలిసి కొన్ని ప్రాథమిక కలరి కదలికలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కలరిపయట్టు ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన మార్షల్ ఆర్ట్ అని, ఇది అన్ని యుద్ధ విద్యలకు 'తల్లి' వంటిదని అభివర్ణించారు. కేరళ సంప్రదాయాల్లో అపారమైన బలం, క్రమశిక్షణ, గ్రేస్ ఉన్నాయని ఆయన కొనియాడారు. కలరి అనేది శారీరక దృఢత్వం, ఫ్లెక్సిబిలిటీ, ఆత్మరక్షణల సమాహారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు, మహాత్మా గాంధీ, శ్రీనారాయణ గురు సమావేశమై వందేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన శతాబ్ది ఉత్సవాల్లో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలు ఆందోళనకర దిశలో సాగుతున్నాయని విమర్శించారు.

# ఈ నెలాఖరు నాటికి
# నక్సలిజం పీడ విరగడవుతుంది

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ మార్చి నెలాఖరు నాటికి భారతదేశం మావోయిజం నుంచి పూర్తి విముక్తి పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలోనే నిర్ణయించుకున్న లక్ష్యం ప్రకారం, దేశాన్ని నక్సలిజం రహితంగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుందని ఆయన వివరించారు. ముఖ్యంగా ఒకప్పుడు మావోయిస్టులు కలలుగన్న 'తిరుపతి నుంచి పశుపతి' వరకు రెడ్ కారిడార్‌ను నిర్మించాలనే కలలను భద్రతా దళాలు పూర్తిగా నాశనం చేశాయని కొనియాడారు. నక్సలిజం పీడను వదిలించడంలో సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్ల అసాధారణ కృషిని అమిత్ షా ప్రశంసించారు. భద్రతా దళాల పటిష్ట వ్యూహాల వల్ల నక్సల్స్ ప్రభావం ఇప్పుడు చాలా తక్కువ ప్రాంతాలకు, అది కూడా కొన్ని మారుమూల ప్రాంతాలకే పరిమితమైందని పేర్కొన్నారు. అభివృద్ధికి అడ్డుపడుతూ, పాఠశాలలు, ఆసుపత్రులను ధ్వంసం చేసే మావోయిస్టుల పట్ల ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని ఆయన హెచ్చరించారు. ఆయుధాలు పట్టి అమాయకులను పొట్టనబెట్టుకునే వారికి ఆయుధాలతోనే సమాధానం చెబుతామని హోం మంత్రి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. మావోయిజం వల్ల దశాబ్దాలుగా వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోందని అమిత్ షా వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వంటి మారుమూల ప్రాంతాల్లో ఇప్పుడు రోడ్లు, విద్యుత్, మొబైల్ కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలు వేగంగా అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు హింసకు నిలయంగా ఉన్న ఆ ప్రాంతాలు ఇప్పుడు అభివృద్ధికి చిహ్నాలుగా మారుతున్నాయని, గిరిజన బిడ్డలకు ఉపాధి, విద్యావకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

## విపక్షం లేకున్నా ఐదు కోట్ల ప్రజల కోసమే చర్చలు

అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా సభలో ఆయన ప్రసంగిస్తూ.. ప్రత్యర్థి పార్టీ సభకు గైర్హాజరై ప్రజా సమస్యలను గాలికొదిలేసినప్పటికీ, తాము మాత్రం ప్రజల ఆకాంక్షలే అజెండాగా ముందుకు సాగామని తెలిపారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. రాష్ట్ర విభజన కష్టాలకు తోడు, గత పాలకుల విధ్వంస పాలన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఇప్పుడు ఇటుక ఇటుక పేర్చి పునర్నిర్మాణం చేసుకోవాల్సి వస్తోందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పక్షాలన్నీ పూర్తి సఖ్యతతో ఉన్నాయని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని వివరించారు. గత ఎన్నికల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థుల్లో 94 శాతం మందిని ప్రజలు గెలిపించారని, ఇది తమపై జనం పెట్టుకున్న నమ్మకానికి నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, అభివృద్ధి, సంక్షేమాలను సమన్వయం చేస్తున్నామన్నారు. ప్రతిపక్షం తీరుపై సీఎం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజలు ఓట్లు వేస్తేనే అధికారం లేదా ప్రతిపక్ష హోదా వస్తాయని హితవు పలికారు. బాధ్యత గల పార్టీగా సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. గడచిన 20 నెలల పాలనలో ఎన్నో కష్టాలను అధిగమించామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేసి సూపర్ హిట్ చేశామని సగర్వంగా ప్రకటించారు. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు, విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులను, పథకాలను నిర్వీర్యం చేసిందని చంద్రబాబు ధ్వజమెత్తారు. 92 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 85 పథకాలు నిధుల మళ్లింపు వల్ల నిర్వీర్యం అయిపోయాయని గణాంకాలతో సహా వివరించారు. ముఖ్యంగా 'జల్ జీవన్ మిషన్' కింద రాష్ట్రానికి రూ.85 వేల కోట్లు రావాల్సి ఉండగా, గత పాలకులు కేవలం రూ.25 వేల కోట్లకే ప్రతిపాదనలు పంపి, చివరకు రూ.2500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకానికి జీవం పోశామని, ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీసుకుంటున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం
# 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది: పవన్ కల్యాణ్

జగన్ పాలనలో జరిగిన 'ఆర్థిక విధ్వంసం' కారణంగా రాష్ట్రం దాదాపు 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమని ఆయన కొనియాడారు. ఇన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, సామాజిక భద్రతా పెన్షన్ల కోసమే రూ. 33 వేల కోట్లు కేటాయించడం సీఎం చంద్రబాబు సాహసోపేతమైన నిర్ణయమని ప్రశంసించారు. గత ప్రభుత్వ హయాంలో అనాలోచిత విద్యుత్ కొనుగోళ్ల వల్ల డిస్కంలకు రూ. 12,250 కోట్ల నష్టం వాటిల్లిందని, విద్యుత్ సంస్థలు రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 'ట్రూడౌన్' పేరిట ఛార్జీలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించామని పవన్ చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల అప్పులను, రూ. 35 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని విమర్శించారు. ఇందులో ఇప్పటికే రూ. 25 వేల కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడం వల్ల రూ. 8,700 కోట్ల కేంద్ర నిధులు నిరుపయోగమయ్యాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు కేటాయించి ఇంటింటికీ మంచినీరు అందించే ప్రాజెక్టును వేగవంతం చేస్తోందని వివరించారు. "నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదు.. భావితరాల కోసం" అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తిని ఉటంకిస్తూ, బడ్జెట్‌లో భావితరాల బాగు కోసం సీఎం చంద్రబాబు మంచి నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు.

## కేరళలో ఎన్నికల ప్రచారం కోసం
## రేవంత్ సర్కార్ వందల కోట్లు తగలేస్తోంది

కోసం వందల కోట్ల రూపాయిల తెలంగాణ ప్రజాధనాన్ని అడ్వర్టైజ్‌మెంట్ల రూపంలో తగలేస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఖజానా ఒక 'ఏటీఎం'లా మారిందని దుయ్యబట్టారు. మహాలక్ష్మి పథకం కింద రూ. 2,500, తులం బంగారం, స్కూటీల హామీలను విస్మరించి, కేరళ పత్రికల్లో మాత్రం మహిళలను కోటీశ్వరులను చేశామని దొంగ ప్రచారం చేసుకుంటున్నారని హరీశ్ విమర్శించారు. ఏటా 2 లక్షల ఉద్యోగాల హామీ నెరవేర్చకపోగా, నోటిఫికేషన్ల కోసం అడిగే విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ వృద్ధులకు రూ. 4,000 పెన్షన్ ఇవ్వడానికి చేతులు రాని రేవంత్ రెడ్డికి... కేరళలో ఫుల్ పేజీ యాడ్స్ ఇవ్వడానికి కోట్లు ఎక్కడివని ప్రశ్నించారు. అబద్ధపు ప్రచారాల కోసం ఖర్చు చేసిన ప్రజాధనాన్ని కాంగ్రెస్ పార్టీ తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీకి కొర్రీలు పెట్టారని, రైతుబంధు ఆపేశారని, వరికి రూ. 500 బోనస్ ఇవ్వకుండా రైతుల పొట్టగొట్టారని ఆరోపించారు.

## తెలంగాణలో ముందుగానే ముదిరిన ఎండలు..
# ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

సాధారణంగా మార్చి మూడో వారం తర్వాత పెరిగే ఎండల తీవ్రత, ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే మొదలైంది. ఈ ఏడాదిలో తొలిసారిగా నిన్న ములుగు జిల్లా మంగపేటలో గరిష్ఠంగా 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ అర్బన్, ధర్మపురి, ఖమ్మం అర్బన్‌లలోనూ 38.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. గత రెండ్రోజులుగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా 2.2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ రాబోయే రోజులకు సంబంధించి కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఇవాళ రాష్ట్రంలోని 6 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. మిగిలిన 27 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు ప్రకటించారు. ఈ వారంలో చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 1.5 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు. ఉత్తర భారతదేశం నుంచి తెలంగాణ వైపు పొడి, వేడి గాలులు వీస్తుండటమే ఈ తీవ్రతకు ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటంతో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం పూట అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని హెచ్చరిస్తున్నారు. శరీరం డీహైడ్రేట్ కాకుండా నీరు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని చెబుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, అనారోగ్యంతో బాధపడేవారు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున, వారు మరింత జాగ్రత్తగా చల్లని ప్రదేశాల్లో ఉండాలని సూచించారు.

# అందుకే మాదిగల వైపు నిలబడ్డా

మొదటి పేజి తరువాయి

తెలంగాణ పునర్నిర్మాణంలో మాదిగల భాగస్వాములు కావాలి. ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న బలమైన ఆకాంక్షతో 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. 2023 లో మా దగ్గర అధికార యంత్రాంగం, అక్రమ సంపాదన లేదు.. చాలా కాలం నుంచి ఎస్సీ వర్గీకరణ అంశం నలుగుతోంది. పోరాటంలో కొంత మంది ప్రాణాలు కూడా పోయాయి. ఎలా అయితే సాధించుకోవాలన్న తపనతో కొందరు ప్రాణ త్యాగాలు చేశారు. ఎన్నో చిక్కుముడులు, కమిషన్లు,తర్జనభర్జనలు జరిగాయి. 20 ఏళ్ల నుంచి ఈ సమస్యను ప్రత్యక్షంగా నేను చూస్తూ వస్తున్నాను. మీరు కొట్లాడిన ప్రతి సందర్భంలో నా చేతనైనా సాయం చేస్తూ వచ్చాను. క్రిష్ణ మాదిగ, సతీష్ మాదిగ నా దగ్గరకు వచ్చినప్పుడు చేతనైన సాయం చేసి అండగా నిలిచాను. అసెంబ్లీలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు ఆనాటి పాలకులు సండ్ర వెంకటవీరయ్య, సంపత్ కుమార్ తో పాటు నన్ను బయటకు గెంటివేశారు. నాకు మహాభారతంలో కర్ణుడు, బార్బరీకుడు అనే పాత్రలు ఇష్టం. కర్ణుడికి అవమానం జరిగినప్పుడు పోరాటం చేశారు.. మిత్రధర్మాన్ని నెరవేర్చాడు. నేను కూడా మిత్రధర్మాన్ని నిర్వర్తించాను.. మాదిగలకు నేను అండగా నిలబడ్డాను. నా శక్తి ఉన్నంతవరకూ మీకు సాయం చేస్తాను' అని సీఎం రేవంత్ తెలిపారు

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయండి సుబ్బారెడ్డి



**డోన్ టౌన్, ఫిబ్రవరి 07,(సీమ కిరణం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి డోన్ పట్టణంలోని వారి క్యాంప్ కార్యాలయం నందు మాట్లాడుతూ.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డోన్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఈ నెల 9వ తేదిన సోమవారం "రైతులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమానికి" డోన్ మండలం, కొత్తబురుజు గ్రామానికి విచ్చేయనున్నారు. కావున పెద్ద ఎత్తున రైతులు, నియోజకవర్గ ప్రజలు,కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వెంకటనాయునిపల్లి గ్రామంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు





**డోన్ టౌన్, ఫిబ్రవరి 07,(సీమ కిరణం న్యూస్):** డోన్ మండలం, వెంకటనాయుని పల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నాడు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో గ్రామానికి సేవలు అందిస్తున్న 20 మంది మహిళామణులకు స్ఫూర్తి సంస్థ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. మహిళల కృషి, పట్టుదల ఎందరికో స్ఫూర్తిదయకమని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వేలకట్టలేనిది అని స్ఫూర్తి సంస్థ అధ్యక్షుడు స్ఫూర్తి మధు అన్నారు. ఈ కార్యక్రమంకి ఆర్థిక సహకారం అందించిన వెంకటనాయునిపల్లి ప్రభుత్వ పాఠశాల టీచర్ రంగనాథ్ కు స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, స్ఫూర్తి సభ్యులు స్ఫూర్తి మధు, భాస్కర్, మోహన్ రెడ్డి, చిట్యాల మహమ్మద్, అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధరతో రైతుకు న్యాయం

డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా రేణుక



**ప్యాపిలి మార్చ్ 07 (సీమ కిరణం న్యూస్ ):** పట్టణంలోని కందుల కొనుగోలు కేంద్రాన్ని డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా రేణుక శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా కందుల కొనుగోలు కేంద్రంలో రైతులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు, రైతులు మార్కెట్కు తీసుకువచ్చిన కందులను పరిశీలించారు. తూకాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుకు న్యాయమైన ధరను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతుల శ్రమకు గౌరవం ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు నాయుడు అని ఇది ప్రజా ప్రభుత్వం,రైతు ప్రభుత్వం అని అన్నారు.

## కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖామర్

మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్న రెవెన్యూ మహిళా ఉద్యోగులు




**కర్నూలు ప్రతినిధి, మార్చి 07, (సీమకిరణం న్యూస్):** మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ మహిళా ఉద్యోగులు కలసి మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమం కర్నూలు కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖామర్ హాజరయ్యారు. అలాగే కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ , పరిపాలన అధికారి శివరాముడు, ఏపీజేఏసీ అమరావతి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ సహేరా బాను, ఏపీజేఏసీ ట్రెజరర్ ఎం. రాజేశ్వరి పాల్గొన్నారు. రెవెన్యూ శాఖకు చెందిన అన్ని మహిళా ఉద్యోగులు మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి ఆనందంగా జరుపుకున్నారు.

# చంద్రబాబు నాయుడు రాక కోసం పూర్తి ఏర్పాట్లు







**డోన్ టౌన్, ఫిబ్రవరి 07,(సీమ కిరణం న్యూస్)** మార్చి 9వ తేదీన డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో నిర్వహించనున్న నూతన పట్టాదారుల పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న సందర్భంగా కొత్తబురుజు గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ ప్రాంగణాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ మతి రాజకుమారి గనియ , జాయింట్ కలెక్టర్ కార్తీక్ , ఎస్పీ సునీల్ శిరాన్ ,ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తో కలిసి చర్చించి అవసరమైన సూచనలు ఎమ్మెల్యే ఇచ్చారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# బేడ బుడగ జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చండి





**డోన్ టౌన్, ఫిబ్రవరి 07,(సీమ కిరణం న్యూస్):** బేడ బుడగ జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేడ బుడగ జంగం కులానికి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలుమార్లు హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయకపోవడం చాలా సిగ్గుచేటు అని విమర్శించారు. కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు మండలంలో నిర్వహించిన సభలో బేడ బుడగ జంగం కులానికి ప్రత్యేక సర్కులర్ ద్వారా న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న రిజర్వేషన్ సమస్యను చట్టబద్ధంగా పరిష్కరిస్తామని చెప్పారని తెలిపారు.అయితే తమ జాతికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న నిర్వహించాల్సిన చలో అమరావతి కార్యక్రమాన్ని సీఎం ఇచ్చిన హామీ నేపథ్యంలో వాయిదా వేస్తున్నామని తెలిపారు. ఈ నెల 9వ తేదీన సీఎం డోన్ నియోజకవర్గానికి రానున్న నేపథ్యంలో ఇచ్చిన మాట ప్రకారం సర్కులర్ లేదా జీవో విడుదల చేసి బేడ బుడగ జంగం కులానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంట్‌లో సమావేశాల్లో పాలకులు తమ జాతి సమస్యపై మాట్లాడినప్పటికీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు న్యాయం చేయకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నేళ్లుగా రిజర్వేషన్ హక్కులు లేక చదువు, ఉద్యోగాలు, సంక్షేమంలో తమ జాతికి అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. సీఎం ఇచ్చిన హామీ నెరవేరనిచో తిరిగి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డోన్, దొరపల్లె నాయకులు పుల్లయ్య, అన్నమయ్య, మద్దిలేటి, సుధాకర్, ఎల్లయ్య, పోలపు బిడి, శ్రీను, అద్దాల ఎల్లప్ప, కదిరప్ప, జమ్మన్న, సుంకన్న, మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో మహిళల దినోత్సవ వేడుకలు



**వెల్దుర్తి, మార్చి 07, (సీమకిరణం న్యూస్) :** వెల్దుర్తిలోని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నందు శనివారం బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు, అసిస్టెంట్ మేనేజర్లు విజయశీలమ్మ, ప్రత్యూష మరియు ఏ.పి.ఎం. అనురాధ, పొదుపు మహిళలు, బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిఎం అనురాధ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరికీ ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రంలో మహిళలందరూ పురోభివృద్ధి వైపు కొనసాగుతున్నారు. ప్రతి మహిళ వారి వారి వృత్తులలోను, వ్యాపారాలలోనూ అభివృద్ధి చెందుతూ కుటుంబాలను అభివృద్ధి వైపు కొనసాగిస్తున్నారు. ప్రతి మహిళ ఒకరిపై ఆధారపడకుండగా వారి సొంత విజ్ఞానంతో బ్యాంకుల వారి రుణాలతో సక్రమంగా లావాదేవీలు కొనసాగిస్తూ జీవితాలను అభివృద్ధి వైపు కొనసాగిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు ఎన్నో పథకాలను అమలుపరిచి మహిళలందరూ ఉన్నత స్థాయిలో ఎదగాలని తెలిపారు. ప్రతి పొదుపు మహిళలు రుణాలను వ్యాపార పరంగాను, పారిశ్రామికపరంగా గాను ఐదు నుంచి పది లక్షల దాక సబ్సిడీ కింద రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో రుణాలు చెల్లించి అభివృద్ధి వైపు కొనసాగాలని తెలిపారు. ఈ సన్నివేశంలో రాజ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి పొదుపు మహిళలు అభివృద్ధి వైపు కొనసాగాలని ప్రతి గ్రూపుకు గతంలో కంటే ప్రస్తుతం ఎక్కువగా లోన్లు విడుదల చేసిన సందర్భాలు ఈ రుణాలను ప్రతి పొదుపు గ్రూప్ మహిళలు సద్వినియోగం చేసుకొని సకాలంలో రుణాలు చెల్లించి దిన దినాభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ సన్నివేశంలో బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు మరియు ఏటీఎం అనురాధ, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు విజయశీలమ్మ, ప్రత్యూష, బ్రాంచి సిబ్బంది, పొదుపు మహిళలు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ విధానం పై ప్రభుత్వ విధానం సవాల్

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో స్మాల్ సర్క్యులేషన్ పత్రికల తరపున నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ (చీూ=ూ) రిట్ పిటిషన్

ఏ-జర్నలిస్టుల స్వయంపోరాటానికి ఒక చారిత్రాత్మక అడుగు.

ప్రత్యేకత -- పార్టీ--ఇన్--పర్సన్‌గా జర్నలిస్టే న్యాయపోరాటం

అక్రిడేషన్ = వృత్తిపరమైన గుర్తింపు

ఎంపానెల్‌మెంట్ = ప్రకటనల పరిపాలనా ప్రక్రియ

సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన

మౌలిక హక్కుల ఉల్లంఘన

అక్రమంగా ఏర్పాటు చేసిన అక్రిడేషన్ కమిటీలు

ఈ రిట్ పిటిషన్ రాష్ట్రవ్యాప్తంగా చిన్న పత్రికలు, గ్రామీణ జర్నలిస్టుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశంగా మారింది. ఈ వ్యవహారంపై హైకోర్టు తీర్పు కోసం మీడియా వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

**అమరావతి, మార్చి 07, (సీమకిరణం న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మీడియా అక్రిడేషన్ వ్యవస్థను ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌తో అనుసంధానం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సవాల్ చేస్తూ, నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ (చీూ=ూ) ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించింది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ కింద దాఖలైన ఈ రిట్ పిటిషన్‌ను, నేషనల్ యాక్టివ్ రిపోర్టర్ అసోసియేషన్ (చీూ=ూ) దాఖలు చేసి పార్టీ--ఇన్--పర్సన్‌గా వాదిస్తున్నారు.

**అక్రిడేషన్ = వృత్తిపరమైన గుర్తింపు**

**ఎంపానెల్‌మెంట్ = ప్రకటనల పరిపాలనా ప్రక్రియ**

పిటిషన్ లో ప్రధానంగా ప్రభుత్వం జారీచేసిన జీవోను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరారు.. ఈ జీవో ద్వారా రాష్ట్రస్థాయి మీడియా అక్రిడేషన్‌కు I&PR ఎంపానెల్‌మెంట్ తప్పనిసరి చేయడం చట్టవిరుద్ధమని పిటిషనర్ వాదించారు. అక్రిడేషన్ అనేది జర్నలిస్టు వృత్తికి సంబంధించిన గుర్తింపు కాగా, ఎంపానెల్‌మెంట్ అనేది ప్రభుత్వ ప్రకటనల పంపిణీకి సంబంధించిన పరిపాలనా ప్రక్రియ అని, ఈ రెండు భిన్నమైన అంశాలను కలిపివేయడం జశీశ్రీశీబత్తీఖఎశ్రీవ జుఇవతీఎఅంవ శీట ౯ాశీఎవతీ కు ఉదాహరణ అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**చిన్న పత్రికలపై పూర్తి బహిష్కరణ**

ఈ జీవో ఆధారంగా రూపొందించిన వెబ్ పోర్టల్‌లో, ఎంపానెల్‌మెంట్ లేని చిన్న సర్క్యులేషన్ పత్రికలకు రాష్ట్రస్థాయి అక్రిడేషన్‌కు అప్లై చేసే అవకాశాన్నే తొలగించారని పిటిషనర్ ఆరోపించారు. పోర్టల్‌లో "చీశే జుశ్రీఅస్త్రఅఎశ్రీవ" అని చూపిస్తూ, జిల్లాస్థాయికి మాత్రమే పరిమితం చేయడం వల్ల 600కు పైగా చిన్న పత్రికలు పూర్తిగా వ్యవస్థ వెలుపలికి నెట్టబడ్డాయని వివరించారు.

**సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన**

గతంలో చెల్లుబాటు అయ్యే అక్రిడేషన్ కలిగిన పత్రికలను కూడా: ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, వినే అవకాశం కల్పించకుండా, అకస్మాత్తుగా వెబ్ పోర్టల్ నుండి తొలగించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని, అలాగే ఇది =వతీశింజూవష్అజవ జఅజఅశ్రీ జశీఅంవనబవఅఎవం విధించడం అవుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**మౌలిక హక్కుల ఉల్లంఘన**

ప్రభుత్వ చర్యల వల్ల: యాదృచ్ఛికత, వివక్ష, పత్రికా స్వేచ్ఛపై ఎష్ట్రఅశ్రీశ్రీఅఅస్త్ర వటటవష్, ఆర్టికల్ వృత్తి నిర్వహణపై ఆంక్ష, జీవనోపాధి, గౌరవ హక్కులు ఉల్లంఘించబడ్డాయని పిటిషనర్ పేర్కొన్నారు.

**అక్రమంగా ఏర్పాటు చేసిన అక్రిడేషన్ కమిటీలు**

రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలలో ఏర్పాటు చేసిన మీడియా అక్రిడేషన్ కమిటీలను కూడా పిటిషన్‌లో తీవ్రంగా తప్పుబట్టారు.

ఎటువంటి: పబ్లిక్ నోటిఫికేషన్ లేకుండా, అర్హత ప్రమాణాలు ప్రకటించకుండా, ప్రధాన జర్నలిస్టు సంఘాలను పక్కనపెట్టి, కొన్ని అనుకూల సంఘాలనే ఏకపక్షంగా ఎంపిక చేసి కమిటీలను ఏర్పాటు చేయడం యాదృచ్ఛికం, పక్షపాతంతో కూడినది, పారదర్శకత లేనిదని ఆరోపించారు.


ఇది "చీవఎశీ యబఎవఇ అఅ ఖుబయు ంబు" అనే సహజ న్యాయ సూత్రానికి విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**హైకోర్టును కోరిన అంశాలు**

పిటిషన్‌లో ప్రధానంగా: +.ూ. వీం. చీశీ.84 (19-08-2025) ను రద్దు చేయాలని, ఎంపానెల్‌మెంట్ లేకున్నా రాష్ట్రస్థాయి అక్రిడేషన్‌కు అప్లై చేసే అవకాశం ఇవ్వాలని, గతంలో రద్దు చేసిన అక్రిడేషన్‌లను పునరుద్ధరించాలని, అక్రమంగా నియమించిన రాష్ట్ర & జిల్లా అక్రిడేషన్ కమిటీలను రద్దు చేయాలని, పారదర్శక విధానంతో కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరారు.

**మధ్యంతర ఉపశమనం కోరుతూ**

రిట్ పిటిషన్ తుది తీర్పు వచ్చే వరకు: అక్రిడేషన్ నిరాకరణ / రద్దుపై స్టే విధించాలని, ప్రభావిత జర్నలిస్టులకు తాత్కాలిక పాస్‌లు ఇవ్వాలని పిటిషనర్ కోర్టును కోరారు. ఈ రిట్ పిటిషన్ రాష్ట్రవ్యాప్తంగా చిన్న పత్రికలు, గ్రామీణ జర్నలిస్టుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశంగా మారింది. ఈ వ్యవహారంపై హైకోర్టు తీర్పు కోసం మీడియా వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.


E-COURTS
HIGH COURTS OF INDIA
High Court of Andhra Pradesh
Back
Principal Bench at Andhra Pradesh
Case Details

| | | |
|---|---|---|
| Case Type | : WP | |
| Filing Number | : 4750/2026 | Filing Date: 04-02-2026 |
| Registration Number | : 6623/2026 | Registration Date: 07-03-2026 |
| CNR Number | : APHC01-005905-2026 | |

Case Status

| | |
|---|---|
| First Hearing Date | : |
| Next Hearing Date | : |
| Stage of Case | : --- |
| Bench | : Single Bench |
| State | : ANDHRAPRADESH |
| District | : KRISHNA |
| Judicial | : WRIT Section |
| Not Before Me | : |

Petitioner and Advocate
1) NATIONAL ACTIVE REPORTS ASSOCIATION
Advocate- PARTY IN PERSON

Respondent and Advocate
1) THE STATE OF AP

Acts

| Under Act(s) | Under Section(s) |
|---|---|
| Constitution of India | 226 |

IA Details

| IA Number | Party | Date of Filing | Next Date | IA Status |
|---|---|---|---|---|
| IA/1/2026 Classification : Stay Petition | NATIONAL ACTIVE REPORTS ASSOCIATION THE STATE OF AP | 07-03-2026 | -- | Pending |
| IA/2/2026 Classification : Direction Petition | NATIONAL ACTIVE REPORTS ASSOCIATION THE STATE OF AP | 07-03-2026 | -- | Pending |

Orders

| Order Number | Order on | Judge | Order Date | Order Details |
|---|---|---|---|---|

OBJECTION

| Sr.No. | Scrutiny Date | OBJECTION | Compliance Date | Receipt Date |
|---|---|---|---|---|
| 1 | 07-03-2026 | All Objections are Complied | -- | -- |

Back

**ప్రత్యేకత -- పార్టీ--ఇన్--పర్సన్‌గా జర్నలిస్టే న్యాయపోరాటం**

ఈ రిట్ పిటిషన్‌లో మరో అత్యంత విశేషమైన అంశం ఏమిటంటే, ఎటువంటి అడ్వకేట్ సహాయం లేకుండా, చిన్న సర్క్యులేషన్ పత్రికలు, గ్రామీణ జర్నలిస్టులు, స్వతంత్ర మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి, ఒక జర్నలిస్టు హోదాలోనే జర్నలిస్టుల సమస్యలను జర్నలిస్టే స్వయంగా హైకోర్టు ముందు పార్టీ--ఇన్--పర్సన్‌గా వాదించడమే. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ జర్నలిస్టు యూనియన్ కూడా ఈ విధంగా అక్రిడేషన్ వ్యవస్థపై, మౌలిక హక్కుల ఉల్లంఘనలపై పార్టీ--ఇన్--పర్సన్‌గా హైకోర్టును ఆశ్రయించిన స్పష్టమైన చరిత్ర లేదని మీడియా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వృత్తి అనుభవం, గ్రౌండ్ రియాలిటీ, గ్రామీణ జర్నలిస్టుల రోజువారీ సాధక బాధలపై ప్రత్యక్ష అవగాహనతో న్యాయస్థానం దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లడం జర్నలిస్టుల హక్కుల పోరాటంలో ఒక చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుందని పేర్కొంటున్నారు.


అధ్వానంగా మారిన మురికి కాలువలు
మురుగు కాలువలు శుభ్రం చేయండి
15వ వార్డు ప్రజలు
వెల్దుర్తి, మార్చి 06, (సీమకిరణం న్యూస్) : కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండల కేంద్రంలో 15వ వార్డు నందు మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువలు చాలా రోజులుగా శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక గ్రామస్తులు చెబుతున్న వివరాల ప్రకారం వార్డులో మురికి కాలువలు తీయడానికి పంచాయతీ సిబ్బంది రావడం లేదని తెలిపారు. ఇంటి పన్నులు, ఇతర చార్జీలు వసూలు చేయడానికి మాత్రం అధికారులు తరచూ వస్తున్నారని, కానీ వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు పంచాయతీ కార్యాలయాన్ని ఆశ్రయించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు. పంచాయతీ బోర్డు వద్దకు వెళ్లి ఈవో లక్ష్మీ నాథ్ ను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరిగి, దుర్వాసన వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి మురికి కాలువలను శుభ్రం చేయాలని, వార్డులోని పలు సమస్యలను పరిష్కరించాలని 15వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

# సీమకిరణం ఎఫెక్ట్

## అధికారుల స్పందన... సమస్య పరిష్కారం






సీమకిరణం పత్రికలో కథనానికి స్పందన..మురికి కాలువలు శుభ్రం..

**వెల్దుర్తి, మార్చి 07, (సీమకిరణం న్యూస్) :** సీమకిరణం తెలుగు దినపత్రికలో అధ్వానంగా మారిన మురికి కాలువలు అనే శీర్షిక శుక్రవారం ప్రచురితం అయ్యింది. శనివారం అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులతో మురికి కాలువలను శుభ్రం చేయించారు. దీంతో వెల్దుర్తి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఒక్కసారిగా కుప్పకూలిన బంగారం ధరలు..

# ఏకంగా రూ.3 వేలు పతనం.. రాత్రికి రాత్రి ధమాల్

సోమవారం బంగారం ధరల్లో ఊహించని భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం ఒకలా ఉన్న ధరలు.. సాయంత్రానికి ఒకేసారి రూ.3 వేలు తగ్గాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి ఇది పెద్ద శుభవార్తగా చెప్పవచ్చు. ప్రస్తుతం బంగారం ధరలు ఎంత ఉన్నాయో ఇప్పుడు చూద్దాం. బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి శుభవార్త. బంగారం ధరల పెరుగుదలకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. గత వారంలో భారీగా పెరుగుతూ వచ్చిన గోల్డ్ రేట్లు.. ఈ వారం ఒక్కసారిగా పతనమవుతూ వస్తోన్నాయి. వేలకు వేలకు బంగారం ధర తగ్గతూ కొనుగోలుదారులకు ఉపశమనం కల్పిస్తోంది. సోవారం ఉదయం ధరలు ఒకలా ఉండగా.. సాయంత్రం కల్లా ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. న్యూ ఇయర్ వస్తున్న క్రమంలో పసడి ధరలు తగ్గుతున్నాయి. డిసెంబర్ 29న సాయంత్రం ఒక్కసారిగా బంగారం ధరల్లో భారీ మార్పులు చేటుచేసుకున్నాయి.



### ఒకేసారి రూ.3 వేలు తగ్గిన గోల్డ్


డిసెంబర్ 29న సాయంత్రం బంగారం ధర ఉన్నట్లుండి ఒకేసారి రూ.3 వేలు తగ్గింది. సోమవారం ఉదయం తులం బంగారంపై కేవలం రూ.650 మాత్రమే తగ్గగా.. సాయంత్రానికి ఏకంగా రూ.2900 తగ్గింది. దీంతో ఇవాళ మొత్తం రూ.3170 తగ్గినట్లు అయింది. తగ్గిన తర్వాత ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ ధర రూ.1,39,250గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,42,420 వద్ద స్థిరపడింది. ఇక 22 క్యారెట్ల బంగారం ధరపై నేడు సాయంత్రం రూ.2900 తగ్గడంతో ప్రస్తుతం రూ.1,27,650 వద్ద కొనసాగుతోంది.

### చెన్నైలో ఇలా..

అటు చెన్నైలో బంగారం రేట్లు ఎక్కువగా తగ్గలేదు. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,42,040గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,42,910 వద్ద స్థిరపడింది. అంటే నిన్నటితో పోలిస్తే కేవలం రూ.870 మాత్రమే తగ్గుముఖం పట్టింది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,30,200గా ఉంది. ఆదివారం ఈ ధర రూ.1,31,000గా ఉంది. అంటే నిన్నటితో పోలిస్తే రూ.800 తగ్గిందని చెప్పవచ్చు.

# 3 పర్సెంట్ రిటైర్మెంట్ రూల్ గురించి తెలుసా?

# ఒకరి మీద ఆధార పడకుండా చేసే ఆర్థిక మంత్రం!




పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రతకు '3 శాతం రిటైర్‌మెంట్ రూల్' ఒక అద్భుతమైన మార్గం. మీ మొత్తం పదవీ విరమణ పొదుపులో మొదటి సంవత్సరంలో 3% మాత్రమే ఖర్చు చేసి, ద్రవ్యోల్బణం ప్రకారం సర్దుబాటు చేస్తారు. ఇది పొదుపులు వేగంగా తగ్గిపోకుండా కాపాడుతుంది, పెట్టుబడి వృద్ధికి అవకాశం కల్పిస్తుంది. పదవీ విరమణ తర్వాత ఆర్థికంగా బలంగా ఉండాలని చాలా మంది అనుకుంటారు. రిటైర్మెంట్ డబ్బుతో మిగతా జీవితాన్ని హ్యాపీగా లీడ్ చేయాలని భావిస్తారు. అయితే రిటైర్మెంట్ తర్వాత వచ్చే డబ్బును సరైన ప్రణాళిక లేకుండా ఖర్చు చేసి ఇబ్బందుల పాలవుతారు. అయితే రిటైర్మెంట్ తర్వాత కూడా ఆర్థికంగా భద్రతా ఉండాలంటే అది 3 పర్సెంట్ రిటైర్మెంట్ రూల్‌తోనే సాధ్యమవుతుంది. మరి ఆ అద్భుతమైన రూల్ గురించి ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

### 3 శాతం పదవీ విరమణ నియమం

3 శాతం పదవీ విరమణ నియమం ప్రకారం మీరు పదవీ విరమణ చేసిన మొదటి సంవత్సరంలో మీ మొత్తం పదవీ విరమణ పొదుపులో 3 శాతం మాత్రమే ఖర్చు చేయాలి. ఆ తర్వాత మీ కొనుగోలు శక్తిని నిర్వహించడానికి ద్రవ్యోల్బణం ప్రకారం ఈ మొత్తాన్ని ప్రతి సంవత్సరం కొద్దిగా పెంచవచ్చు. ఉదాహరణకు మీ మొత్తం పదవీ విరమణ మూలధనం రూ.1 కోటి అని అనుకుందాం. మొదటి సంవత్సరంలో మీరు 3 శాతం అంటే రూ.3 లక్షలు విత్‌డ్రా చేసుకోవచ్చు. వచ్చే ఏడాది ద్రవ్యోల్బణం 5 శాతం వద్ద ఉంటే, మీరు దాదాపు రూ.3.15 లక్షలు విత్‌డ్రా చేసుకోవచ్చు. ఈ విధంగా ఖర్చులు క్రమంగా పెరుగుతాయి, కానీ సేవింగ్స్‌పై ఎలాంటి ఒత్తిడి ఉండదు.

### 3 పర్సెంట్ రూల్ ఎందుకు సురక్షితం?


ఆదిత్య బిర్లా క్యాపిటల్ లైఫ్ ఇన్సూరెన్స్ నివేదిక ప్రకారం ఈ నియమం అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే ఇది మీ పొదుపులు చాలా త్వరగా తగ్గిపోకుండా నిరోధిస్తుంది. తక్కువ ఉపసంహరణలు మీ డబ్బు పెట్టుబడిగా ఉండటానికి, పెరగడానికి ఎక్కువ సమయం ఇవ్వడానికి అనుమతిస్తాయి. దీనివల్ల అనేక ఇతర ముఖ్యమైన ప్రయోజనాలు ఉన్నాయి. మార్కెట్ హెచ్చుతగ్గులు లేదా ఊహించని ఖర్చులను ఎదుర్కోవడానికి బలమైన పరిపుష్టిని అందిస్తుంది. పదవీ విరమణ నిధి 25-30 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు కొనసాగుతుందనే నమ్మకం ఉంటుంది. ఇది కఠినమైన నియమం కాదు. అవసరమైతే మీరు మీ ఖర్చును పెంచవచ్చు లేదా తగ్గించవచ్చు.

### అందరికీ సరైనదేనా?

ఈ రూల్ అందరికీ సరైందేనా అంటే.. కాదు. ప్రతి వ్యక్తి అవసరాలు, పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. కాబట్టి ఈ నియమానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. తక్కువ ఖర్చుల కారణంగా, పదవీ విరమణ ప్రారంభ సంవత్సరాల్లో జీవనశైలి కొంచెం సరళంగా ఉండవచ్చు. ఈ నియమం చారిత్రక మార్కెట్ డేటాపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తులో రాబడి అలాగే ఉంటుందని ఎటువంటి హామీ లేదు. 40 లేదా 45 సంవత్సరాల వయస్సులో పదవీ విరమణ చేయాలనుకునే వారికి పెద్ద కార్పస్ లేదా మరింత నియంత్రణతో కూడిన ఖర్చు అవసరం.

## ఉద్యోగం మానేస్తే పీఎఫ్ వడ్డీ నిలిచిపోతుందా..?

## చాలామందికి తెలియని అసలు రూల్స్ ఇవే..



పీఎఫ్ అకౌంట్ గురించి ఇటీవల అనేక అపోహలు వినిపిస్తున్నాయి. పీఎఫ్ అకౌంట్ ఇన్ అపరేటివ్ అయితే వడ్డీ రాదని కొంతమంది అనుమానపడుతున్నారు. అలాగే ఉద్యోగం మానేసినా లేదా వేరే కంపెనీకి మారినా వడ్డీ ఆగిపోతుందని డౌట్ పడుతున్నారు. వీటికి సమాధానాలు ఇందులో చూద్దాం. ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ప్రతీఒక్క ఉద్యోగికి ఈపీఎఫ్ అకౌంట్ అనేది ఉంటుంది. ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్‌ల ప్రకారం ఏ రంగంలో పనిచేసే ఉద్యోగికైనా పీఎఫ్ అకౌంట్ తప్పనిసరి చేసింది. గిగ్ కార్మికులకు కూడా ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ సదుపాయం కల్పించాలని సూచించింది. ఇక పీఎఫ్ అకౌంట్ ఉన్నవారికి అనేక బెనిఫిట్స్ ఉన్నాయి. పీఎఫ్ అకౌంట్‌లోని బ్యాలెన్స్ నిల్వలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ ప్రకటిస్తూ ఉంటుంది. ప్రతీ ఏడాది వడ్డీ రేట్లు మారుతూ ఉంటాయి. దాదాపు 9 శాతం వరకు బ్యాలెన్స్ మొత్తంపై వడ్డీ ఇస్తూ ఉంటుంది. అయితే ఉద్యోగం మానేసినా లేదా మారినా పీఎఫ్ వడ్డీ ఆగిపోతుందా? అనే అనుమానం చాలామందికి ఉంటుంది.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి..?**

ఈపీఎఫ్‌వో నిబంధనల ప్రకారం.. ఉద్యోగం మానేసినా లేదా వేరే ఉద్యోగం మారినా పీఎఫ్ బ్యాలెన్స్‌పై కేంద్రం ఇచ్చే వడ్డీ మాత్రం ఆగదు. మీ పీఎఫ్ బ్యాలెన్స్ ఎంత ఉంటే.. అంత మొత్తంపై యథావిధిగా వడ్డీ జమ అవుతూ ఉంటుంది. మీరు పీఎఫ్ బ్యాలెన్స్ మొత్తం విత్ డ్రా చేసుకునేవరకు వడ్డీ కొనసాగుతూ ఉంటుంది. పీఎఫ్ బ్యాలెన్స్ విత్ డ్రా చేసుకోకపోతే 58 ఏళ్లు నిండేంతవరకు వడ్డీ కొనసాగుతూ ఉంటుంది. ఒకవేళ పీఎఫ్ అకౌంట్‌కు మూడేళ్ల పాటు ఎలాంటి కాంట్రిబ్యూషన్స్‌ను జరగకపోతే అకౌంట్ ఇన్ అపరేటివ్ అయ్యే ఛాన్స్ ఉంది. అలా అయినా మీకు వడ్డీ మాత్రం జమ అవుతుంది.

**వడ్డీ ఎంత..?**

ప్రతీ ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేట్లు మారుతూ ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వడ్డీ రేట్లను సవరిస్తూ ఉంటుంది. తగ్గించడం లేదా పెంచడం లాంటివి చేస్తూ ఉంటుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 8.25 శాతం వడ్డీని నిర్ణయించింది. ఇక 2025-26 సంవత్సరానికి ఇంకా వడ్డీ రేట్లు ప్రకటించలేదు. ఫిబ్రవరిలో కేంద్రం ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. ఈ సారి వడ్డీ రేటును పెంచే ఛాన్స్ ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే పీఎఫ్ అకౌంట్ ఉన్నవారికి శుభపరిణామంగా చెప్పవచ్చు.

## మీ బ్యాంక్ అకౌంట్ పనిచేయకుండా ఇనాక్టివ్ అయిందా..? ఈ సింపుల్ పని చేస్తే క్షణాల్లోనే యాక్టివ్‌లోకి..




ఒక ఏడాది లేదా రెండేళ్ల పాటు బ్యాంక్ అకౌంట్ నుంచి ఎలాంటి ట్రాన్సాక్షన్ చేయకపోతే ఇనాక్టివ్ అవుతుందనే విషయం మనందరికీ తెలిసే ఉంటుంది. ఇలాంటప్పుడు డెబిట్ కార్డు, ఆన్ లైన్ సేవలు కూడా బంద్ అవుతాయి. అప్పుడు మళ్లీ అకౌంట్ వాడాలంటే ఏం చేయాలంటే.. వేర్వేరు అవసరాల దృష్ట్యా ప్రస్తుత కాలంలో ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ అకౌంట్లను వాడుతున్నారు. శాలరీ రీత్యా ఒక అకౌంట్, వ్యక్తిగత అవసరాల కోసం మరో అకౌంట్ వాడుతూ ఉంటారు. ఇక స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్ లాంటి వాటిల్లో పెట్టుబడి పెట్టేవారు అందుకోసం మరో ప్రత్యేక అకౌంట్ ఉపయోగిస్తూ ఉంటారు. ఇక వ్యాపారులు బిజినెస్ లావాదేవీల కోసం కరెంట్ అకౌంట్ లాంటివి ఉపయోగిస్తూ ఉంటారు. ఇలా వేర్వేరు అవసరాల కోసం రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలను వాడేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. అవసరం లేని పరిస్థితుల్లో కొన్నిసార్లు ఒకే అకౌంట్‌ను వాడుతూ మిగతా అకౌంట్లను పట్టించుకోవడం మానేస్తారు.

**రెండేళ్లు ఉపయోగించకుండా ఉంటే..?**

రెండేళ్ల పాటు బ్యాంక్ అకౌంట్‌ను ఉపయోగించకుండా లేదా ఎలాంటి ట్రాన్సాక్షన్లు చేయకుండా ఉంటే ఆటోమేటిక్‌గా సిస్టమ్ ఇనాక్టివ్ చేస్తోంది. కొన్ని బ్యాంకులు అయితే ఒక సంవత్సరం ఎలంటి లావాదేవీలు నిర్వహించకపోతే ఇనాక్టివ్‌గా చేస్తున్నాయి. ఆ గడువులోగా అకౌంట్‌లో డబ్బులు డిపాజిట్ చేయడమో లేదా విత్ డ్రా చేయడమో, ఏటీఎం ఉపయోగించడమో లాంటి ఏదోక లావాదేవీ నిర్వహించాలి. లేకపోతే బ్యాంకులు అకౌంట్ పనిచేయకుండా ఇనాక్టివ్ లేదా డార్మాంట్ చేస్తూ ఉంటాయి. ఇలా చేస్తే మీరు అకౌంట్ నుంచి ఎలాంటి ట్రాన్సాక్షన్స్ చేయలేరు. అలాగే డెబిట్ కార్డు కూడా పనిచేయదు. ఆన్‌లైన్ లావాదేవీలు నిలిపివేయడంతో పాటు మినిమం బ్యాలెన్స్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

**అకౌంట్ ఇనాక్టివ్ అయితే ఏం చేయాలి..?**

అకౌంట్ ఇనాక్టివ్ అయినంత మాత్రాన మీ అకౌంట్ ఎక్కడికి పోదు. మీ అకౌంట్లోని డబ్బులు కూడా అలాగే ఉంటాయి. మీరు బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లి ఆధార్, పాన్ లేదా ఏదైనా గుర్తింపు ధృవీకరణ పత్రం చూపించి ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇలా చేయగానే మీ అకౌంట్ వెంటనే యాక్టివ్ అవుతుంది. ఆ తర్వాత మీరు ఎప్పటిలాగే బ్యాంక్ అకౌంట్‌ను ఉపయోగించుకోవచ్చు. అందులో ఏమైనా డబ్బులు ఉన్నా విత్ డ్రా చేసుకోవచ్చు.

## మీ సొంతింటి కలను నిజం చేసే బ్యాంకులు..!

## తక్కువ వడ్డీకే హోమ్ లోన్ ఇస్తున్న బ్యాంకుల లిస్ట్ ఇదే..




భారతదేశంలో సొంత ఇల్లు కలిగి ఉండటం అనేది ఒక విజయంగా పరిగణించబడుతుంది. గృహ రుణాలు ఈ ఆకాంక్షను నెరవేర్చడంలో కీలకం. వడ్డీ రేట్లు, రుణ మొత్తం, క్రెడిట్ స్కోర్ ఆధారంగా మారుతాయి. భారతీయ గృహ ఫైనాన్సింగ్ పారదర్శకత, రుణగ్రహీతల రక్షణపై దృష్టి సారించి, మరింత పరిణతి చెందిన దశలోకి ప్రవేశిస్తోంది. ం సొంత ఇల్లు లేదా ఫ్లాట్ కొనడం అంటే మన దేశంలో దాన్నో సక్సెస్‌గా భావిస్తారు. కెరీర్ ప్రారంభ దశలోనే ఇల్లు సొంతం చేసుకోవాలనే కోరిక ఎక్కువ మంది భారతీయ పౌరుల్లో పెరుగుతోంది, వ్యక్తులు, కుటుంబాలు నివాస ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి చురుకుగా చూస్తున్నారు. వాటి స్థోమత, లభ్యత, వశ్యత కారణంగా వినియోగదారులు ఇల్లు లేదా ఫ్లాట్ సొంతం చేసుకోవాలనే వారి ఆకాంక్షను నెరవేర్చుకోవడానికి గృహ రుణాలు ఒక ప్రసిద్ధ, ముఖ్యమైన సాధనంగా మారాయి. గృహ రుణంలో పరిగణించవలసిన ప్రధాన అంశం వడ్డీ రేటు. వివిధ రుణదాతలు గృహ రుణాలపై మొత్తం, పరిపక్వత, క్రెడిట్ స్కోరు, రెపో రేటు ఆధారంగా వేర్వేరు వడ్డీ రేట్లను అందిస్తారు. భారతదేశంలో గృహ ఫైనాన్సింగ్ మరింత పరిణతి చెందిన, బాధ్యతాయుతమైన దశలోకి కదులుతోందని, వేగవంతమైన వృద్ధిపై మునుపటి దృష్టి నుండి దూరంగా మారుతోందని %దీూూ×జ% హోమ్ లోన్ %జజుూ% అండ్ సహ వ్యవస్థాపకుడు అతుల్ మోంగా అన్నారు. ఈ రంగం ఇప్పుడు పారదర్శకత, బలమైన పాలన, రుణగ్రహీతల రక్షణపై నిర్మించబడిన క్రమశిక్షణ కలిగిన పర్యావరణ వ్యవస్థగా అభివృద్ధి చెందుతోందని మోంగా అన్నారు. హౌసింగ్ ఫైనాన్స్‌లో స్థిరమైన వృద్ధికి ఈ మార్పు సకాలంలో అవసరమని ఆయన పేర్కొన్నారు.

## అదిరిపోయే న్యూస్.. గంటల్లోనే రూ.20 వేలకు పైగా తగ్గిన వెండి ధర.. అసలు కారణం ఏంటంటే..?




బులియన్ మార్కెట్‌లో వెండి ధరలు అనూహ్యంగా పడిపోయాయి. కేవలం కొన్ని గంటల్లో కిలో వెండి రూ.21,000 క్షీణించి ఇన్వెస్టర్లను షాక్‌కు గురిచేసింది. ఇన్ని రోజులు ఇన్వెస్టర్లకు లాభాలు ఇచ్చిన వెండి ఒక్కసారిగా ఎందుకు పడిపోయింది. దానికి గల కారణాలు ఏంటీ..? అన్నది ఇప్పుడు తెలుసుకుందాం.. అస్థిరతకు మారుపేరుగా మారిన బులియన్ మార్కెట్‌లో సంచలనం నమోదైంది. గత కొంతకాలంగా రికార్డు స్థాయిల్లో దూసుకుపోతున్న వెండి ధరలు అకస్మాత్తుగా కుప్పకూలాయి. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే కిలో వెండి ధర ఏకంగా రూ.21,000 మేర క్షీణించడంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో సోమవారం మధ్యాహ్నం సెషన్‌లో వెండి ఫ్యూచర్స్ భారీగా పతనమయ్యాయి. గత సెషన్‌లో కిలో వెండి ధర రూ.2,54,174 వద్ద ట్రేడ్ అయింది. అయితే లాభాల స్వీకరణ దెబ్బకు ధర ఒక్కసారిగా రూ.2,33,120 కనిష్టానికి పడిపోయింది. అత్యంత గరిష్ట స్థాయిలను తాకిన వెంటనే వ్యాపారులు లాభాలను వెనక్కి తీసుకోవడం ప్రారంభించడంతో మార్కెట్ ఈ స్థాయి పతనాన్ని చూసింది.

### అంతర్జాతీయ మార్కెట్ ఒత్తిడి

ప్రపంచ మార్కెట్‌లో కూడా వెండి అస్థిరంగా మారింది. తొలిసారిగా ఔన్సుకు 80 డాలర్ల మార్కును తాకినప్పటికీ, ఆ స్థాయిని ఎక్కువసేపు నిలబెట్టుకోలేకపోయింది. అగ్రరాజ్యం అమెరికా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం దిశగా సానుకూల సంకేతాలు రావడం వెండి ధరలపై తీవ్ర ప్రభావం చూపింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో సురక్షిత పెట్టుబడిగా ఉన్న వెండికి డిమాండ్ తగ్గింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ఔన్సు ధర 75 డాలర్ల కంటే దిగువకు పడిపోయింది.

### భవిష్యత్తులో ధరలు ఎలా ఉండబోతున్నాయి?

ప్రస్తుతం ధరలు తగ్గినప్పటికీ దీర్ఘకాలంలో వెండి మెరిసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో రూ. 2,75,000 చేరుకోవచ్చనే అంచనాలు ఉన్నాయి. జనవరి 1, 2026 నుండి చైనా విధించబోయే ఎగుమతి ఆంక్షలు వెండి సరఫరాపై ప్రభావం చూపుతాయి. వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాలు బంగారం, వెండి ధరలకు బలాన్ని ఇవ్వవచ్చు. గ్లోబల్ ట్రేడ్ వార్స్ మళ్లీ మొదలైతే లోహాల ధరలు పెరిగే ఛాన్స్ ఉంది. బంగారం, వెండి ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు కనిపిస్తున్నందున, పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉండాలని, నిపుణుల సలహాతోనే ముందడుగు వేయాలని మార్కెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు.

## స్టాక్ మార్కెట్లో దిగ్గజాలను ఓడిస్తున్న పతంజలి.. ఐదేళ్లలో ఎంత సంపాదించిందంటే..




మార్కెట్లో పతంజలి తనదైన శైలిలో దూసుకుపోతోంది. తన వ్యాపారాన్ని మరింతగా విస్తరించుకుంటూ లాభాలను గడిస్తోంది. పతంజలి ఫుడ్స్ స్టాక్ మార్కెట్లో ప్రవేశించినప్పటి నుంచి తన పెట్టుబడిదారులకు మంచి లాభాలను అందిస్తోంది. గత ఐదు సంవత్సరాలలో చూసి భారీగా సంపాదించుకుంది.. పతంజలి ఫుడ్స్ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించినప్పటి నుండి ఇది పెట్టుబడిదారులకు 55% కంటే ఎక్కువ రాబడిని అందించింది. ఈ సంఖ్య గత ఐదు సంవత్సరాలను సూచిస్తుంది. గమనించదగ్గ విషయం ఏమిటంటే హిందూస్తాన్ యూనిలీవర్, నెస్లే, డాబర్‌తో సహా దేశంలోని ప్రముఖ %ఖీవీజ+% కంపెనీలు కూడా అలాంటి రాబడిని అందించలేకపోయాయి. %ఎఖూ%, డాబర్ ఇండియా పెట్టుబడిదారులకు ప్రతికూల రాబడిని అందించగా, నెస్లే ఇండియా ఐదు సంవత్సరాలలో 39% కంటే ఎక్కువ రాబడిని అందించింది. అయితే పతంజలి మాత్ర తన వ్యాపారాన్ని గణనీయంగా విస్తరించింది. పతంజలి ఫుడ్స్ షేర్లు రాబోయే రోజుల్లో మరిన్ని లాభాలను చూడవచ్చు. గత ఐదు సంవత్సరాలలో దేశంలోని ప్రముఖ %ఖీవీజ+% కంపెనీలతో పోలిస్తే స్టాక్ మార్కెట్ ఎలా పనిచేసిందో కూడా తెలుసుకుందాం..

**పతంజలి 5 సంవత్సరాల రాబడి:**

గత ఐదు సంవత్సరాలలో పతంజలి ఫుడ్స్ స్టాక్ పెద్ద కంపెనీలతో పోలిస్తే పెట్టుబడిదారులకు గణనీయమైన రాబడిని అందించింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ డేటా ఆధారంగా, పతంజలి ఫుడ్స్ స్టాక్ పెట్టుబడిదారులకు సుమారు 57% రాబడిని అందించింది. ఐదు సంవత్సరాల క్రితం కంపెనీ స్టాక్ సుమారు రూ.347 వద్ద ట్రేడవుతోంది. అప్పటి నుండి కంపెనీ స్టాక్ రూ.197 కంటే ఎక్కువ లాభపడింది. ప్రస్తుతం కంపెనీ స్టాక్ రూ.544.10 వద్ద ట్రేడవుతోంది. ఇది 52 వారాల కనిష్ట స్థాయి రూ.521 కంటే మెరుగ్గా ఉంది. రాబోయే రోజుల్లో పతంజలి స్టాక్ మరిన్ని లాభాలను చూడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**హిందూస్తాన్ యూనిలీవర్ షేర్లు పతనం:**

మరోవైపు దేశంలో అతిపెద్ద కంపెనీ అయిన హిందూస్తాన్ యూనిలీవర్ షేర్లు గత ఐదు సంవత్సరాలుగా క్షీణించాయి. గత ఐదు సంవత్సరాలుగా లో కంపెనీ స్టాక్ 4% కంటే ఎక్కువ తగ్గిందని డేటా చూపిస్తుంది. ముఖ్యంగా గత ఐదు సంవత్సరాలుగా కంపెనీ స్టాక్ రూ.2,100 నుండి రూ.2,200 పరిధిలో ట్రేడవుతోంది. సెప్టెంబర్ 2024లో కంపెనీ స్టాక్ రూ.2,900 మార్కును అధిగమించింది. కానీ అప్పటి నుండి తగ్గింది.

**డాబర్ షేర్లు కూడా నష్టాలను చవిచూశాయి:**

మరోవైపు డాబర్ స్టాక్ కూడా పెట్టుబడిదారులకు నష్టాలను తెచ్చిపెట్టింది. గత ఐదు సంవత్సరాలలో కంపెనీ షేర్లు 8 శాతానికి పైగా క్షీణించాయి. డేటాను పరిశీలిస్తే కంపెనీ స్టాక్ ప్రస్తుతం 8 శాతం తగ్గి రూ.490.10 వద్ద ట్రేడవుతోంది. 2024 సెప్టెంబర్‌లో కంపెనీ స్టాక్ రూ.670 వద్ద గరిష్ట స్థాయికి చేరుకోగా, అప్పటి నుండి గణనీయమైన క్షీణత కనిపించింది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com